# ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

- రంగారెడ్డి కలెక్టర్ భారతి హోలీకేరీ
- అసెంబ్లీ ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోలీకేరీ

ఇబ్రహీంపట్నం, నవంబర్ 25 : శాసనసభ ఎన్నికలను జిల్లాలో పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రధాన పార్టీల ప్రతినిధులతో శనివారం ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఈ నెల 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు కృషి చేయాలన్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

జిల్లాలోని 96,405 మందికి ఈ నెల 26 నుంచి ఓటరు గుర్తింపు కార్డులను, ఓటరు స్లిప్‌లను బీఎల్‌ఓల ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. పోలింగ్ రోజున పొలిటికల్ నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పోలింగ్ బూత్‌లకు 200 మీటర్ల మేరకు ఎలాంటి ఎన్నికల బూత్‌ల ఏర్పాటు, ప్రచారం చేయొద్దని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై ఆక్రమణల ద్వారా, మతపరమైన ప్రదేశ ప్రాంగణాలలో, విద్యా సంస్థలు, దవాఖానలు ఉన్న ప్రదేశాల్లో ఎన్నికల బూత్‌లను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కోసం వెళ్లే ఓటర్లను అడ్డుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం చట్టరీత్యా నేరమన్నారు.

ఎన్నికల కమిషన్ నియమించిన పరిశీలకులు, పోలీసులు, అధికారులు, ఎన్నికల సిబ్బంది మినహా ఇతరులు లోనికి అనుమతించబడరన్నారు. పోలింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్లు, వైర్‌లెస్ సెట్లు అనుమతించబడవని, 100 మీటర్ల దూరంలో వాటిని ఉపయోగించాలని ఆమె సూచించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయత వాతావరణంలో వినియోగించుకునేలా అందరూ సహకరించాలని ఆమె కోరారు. ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లను చైతన్యపర్చాలని కోరారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేలా ఎన్నికల అధికారులకు అన్ని విధాలుగా సహకరించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగపు అధికారి సైదులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

## క్రమశిక్షణతో ఎన్నికల విధుల్లో పాల్గొనాలి

**ఎస్పీ కోటిరెడ్డి**

వికారాబాద్, నవంబర్ 25 : అందరూ ఓపికగా, సమయ స్ఫూర్తితో, క్రమశిక్షణతో ఎన్నికల విధుల్లో పాల్గొనాలని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎన్నికల సందర్భంగా వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులతో ఎస్పీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్న రూట్ అధికారులు, పోలింగ్ రోజు విధులు నిర్వహించబోయే పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా రూట్ మొబైల్ అధికారులు అప్రమతంగా ఉంటూ అధికారులందరితో సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. సున్నిత, అతి సున్నిత గ్రామాల్లో బందోబస్తు నిర్వహించే పోలీస్ అధికారులు జాగ్రత్తగా విధులు చేపడుతూ ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలించాలన్నారు. సీసీ టీవీల పర్యవేక్షణలో పోలింగ్ జరుగుతున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎవ్వరు కూడా పోలింగ్ స్టేషన్‌లలోకి సెల్‌ఫోన్‌లు, కెమెరాలు, వీడియో రికార్డర్లు తీసుకొని వెళ్లకుండా చూడాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది తమ విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. తమ పై అధికారుల వివరాలు కూడా తెల్సుకొని ఉండాలని, ఏదైనా అవసరముంటే, ఉన్నతాధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని.. వారికి వివరించాలని సూచించారు. సోషల్ మీడియాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఫొటోలు, వీడియోలు, పుకార్లపై పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, వికారాబాద్ డీఎస్పీ నర్సింహులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది


కొడంగల్ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ మదిరాజ్

## స్వరాష్ట్రంలో తొలగనున్న బీసీల కష్టాలు

- మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలి
- ముదిరాజ్‌లు బీఆర్‌ఎస్‌కు ఓటెయ్యాలి
- మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ మదిరాజ్

కొడంగల్, నవంబర్ 25 : సీఎం కేసీఆర్ హయాంలో స్వరాష్ట్రంలో ముదిరాజ్ కష్టాలు తొలగిపోయే రోజులు రానున్నాయని మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. శనివారం పట్టణంలో నియోజకవర్గ ముదిరాజ్ రాష్ట్ర మహాసభ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలతో పోల్చితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి వల్ల సమైక్య రాష్ట్రంలో బీసీ వర్గాలకు జరిగిన అన్యాయాలు ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలను చాలా వరకు పోటీలో ఉంచడం వల్ల ముదిరాజ్‌లకు అవకాశం లభించలేదని, ఇకపై మంచి రోజులు రానున్నాయని ఆయన హామీ ఇచ్చారు. రాజ్యసభ ఎంపీ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్, మేయర్, జడ్పీ మున్సిపల్ చైర్మన్, జడ్పీటీసీ, ఎంపీపీ పదవుల్లో ముదిరాజ్‌లకు తప్పనిసరిగా పెద్దపీట వేస్తామని సీఎం కేసీఆర్ మాట ఇచ్చారని వెల్లడించారు. కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని.. రాజకీయ పదవులతో పాటు జనాభాలో పెద్ద వాటాగా ఉన్న ముదిరాజ్‌లకు సామాజికంగా న్యాయం జరుగుతుందన్నారు.

ముదిరాజ్‌ల చిరకాల డిమాండ్ బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్ బదలాయింపును కేసీఆర్ నెరవేరుస్తారని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ముదిరాజ్‌లతో పాటు బీసీ వర్గాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముదిరాజ్‌లందరూ ఏకతాటిపైకి వచ్చి కొడంగల్ అసెంబ్లీ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సమాశంలో కొడంగల్ నియోజకవర్గ ముదిరాజ్ మహాసభ ముఖ్య నాయకులు వేణుగోపాల్, నర్సింహులు, శివకుమార్, సాయిలు, రాములు, గోపాల్ పాల్గొన్నారు.

### ప్రచార సరళిని తెలుసుకున్న కాసాని

పరిగి : పరిగిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి ప్రచార సరళిని తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలుసుకున్నారు. శనివారం పరిగిలో దివంగత మాజీ డిప్యూటీ స్పీకర్ హరీశ్వర్‌రెడ్డి సతీమణి గిరిజ, కుమారుడు అనిల్‌రెడ్డిని కలిసి పరిగిలో బీఆర్‌ఎస్ ప్రచార సరళిపై కాసాని జ్ఞానేశ్వర్ చర్చించారు.

# రేవంత్.. ఇదే మా చివరి హెచ్చరిక

- కాంగ్రెస్ గూండాలు దౌర్జన్యం చేస్తే ఊరుకోం..
- రేవంత్‌కు కొడంగల్‌లో ఓటమి తప్పదు
- నీకు దమ్ము, ధైర్యం ఉంటే గ్రామాల్లో, మున్సిపల్‌లో తిరిగి ఓటు అడుగు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి, నవంబర్ 25 : రేవంత్‌రెడ్డి.. ఇదే మా చివరి హెచ్చరిక.. మేము దేనికైనా సిద్ధం.. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోం అని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం కోస్గి మున్సిపల్‌లోని ఫామ్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి.. మా కార్యకర్తల సైన్యం ముందు మీరెంత.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓపిక పడుతున్నామన్నారు. కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దౌర్జన్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఇంకోసారి శిరీష ఇంటికిగాని, కార్యకర్తల ఇంటికిగాని వెళ్తే తీవ్ర పరిణామాలు చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో నామినేషన్ వేసినప్పటి నుంచి కార్యకర్తలను రెచ్చగొట్టి రాయలసీమ ఫాక్షన్‌గా మార్చుతున్నారన్నారు. ఓటమి భయంతోనే రెచ్చగొట్టేలా కార్యకర్తలను ఉసిగొల్పుతున్నారన్నారు. కొడంగల్‌లో ఉన్న గ్రామల్లో రేవంత్‌రెడ్డి తిరిగి ఓటు అడిగే ధైర్యం లేక ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే ప్రజలు ఓట్లు వేయరన్నారు. నువ్వు కొడంగల్‌లో ఎమ్మెల్యేగానే గెలిచే పరిస్థితిలేదు.. ఎట్లా సీఎం అవుతావని ఎద్దేవా చేశారు. ఇప్పుడే ఇంత దౌర్జన్యం చేస్తే గెలిస్తే ఏం చేస్తాడో నియోజకవర్గ ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. గ్రామాల్లో ఓటు అడిగేందుకు రానివాడు గ్రామల్లో అభివృద్ధి ఎట్ల చేస్తాడో గ్రామీణ ప్రజలు యోచించాలన్నారు. రైతు బంధు అందించరాదని రేవంత్‌రెడ్డి కోర్టులో కేసు వేశాడన్నారు. అయితే కోర్టు ఈ నెల 28న రైతు బంధు అందించవచ్చని ఇచ్చిన తీర్పు రేవంత్‌రెడ్డికి చెంపదెబ్బ లాంటిదని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, జడ్పీటీసీ ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ మధుకర్‌రావు, వైస్ ఎంపీపీ సాయిలు, మున్సిపల్ అధ్యక్షుడు రాజేశ్, కౌన్సిలర్లు మాస్టర్ శ్రీను, జనార్దన్‌రెడ్డి, బందెప్ప, నాయకులు రాజేందర్‌రెడ్డి, వరప్రసాద్, వెంకట్‌నర్సింహులు, సాయిలు, సత్యమూర్తి, నటరాజ్, వెంకటేశ్, అనంతయ్య పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ లండన్ ఇన్‌చార్జి శివకుమార్

# తెలంగాణకు శ్రీరామరక్ష సీఎం కేసీఆర్

పరిగి, నవంబర్ 25 : తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష సీఎం కేసీఆర్ అని బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ లండన్ ఇన్‌చార్జి శివకుమార్ పేర్కొన్నారు. శనివారం పరిగిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డిని కలిసి ఆయనకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. ప్రాణాలకు తెగించి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ అని, తొమ్మిదిన్నర సంవత్సరాల్లో రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని చెప్పారు. అభివృద్ధితోపాటు సంక్షేమానికి పెద్ద పీట వేయడం ద్వారా తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. హైదరాబాద్ అభివృద్ధి, ఐటీ రంగంలో నంబర్ వన్ స్థానంలో నిలవడం వెనకాల ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కృషి ఉందన్నారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం, మౌలిక సదుపాయాలు కల్పించడంతో హైదరాబాద్ లండన్‌ను తలపిస్తున్నదని ఆయన కొనియాడారు. పదేండ్ల క్రితం హైదరాబాద్, నేటి హైదరాబాద్ నగరానికి ఎంతో తేడా ఉందని.. అభివృద్ధిలో దేశంలోని అన్ని నగరాలను దాటి హైదరాబాద్ ముందు వరుసలో నిలుస్తున్నదన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మహేశ్‌రెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పరిగి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి నాగేందర్‌గౌడ్, నాయకులున్నారు.

కులకచర్ల : మండల పరిధిలోని పలు గ్రామాల్లో శివకుమార్ ప్రచారం చేస్తూ మరోసారి సీఎం కేసీఆర్‌ను అధికారంలోకి తీసుకురావాలని, బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు చేసేవారికి, ఉన్నత విద్య చదివేవారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చాలా ఉపయోగపడిందని తెలిపారు.

# దళితుల ఆర్థికాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

- రైతు బంధు మండలాధ్యక్షుడు నాయబ్‌గౌడ్
- మర్పల్లి మండలంలోని పలు గ్రామాల్లో సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

మర్పల్లి, నవంబర్ 25 : దళితుల ఆర్థికాభివృద్ధికే సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రైతు బంధు మండలాధ్యక్షుడు నాయబ్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కొంషట్‌పల్లి, దామస్తాపూర్ తదితర గ్రామాల్లో సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేస్తున్నదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభలో నియోజకవర్గంలోని దళిత కుటుంబాలకు ఒకేసారి దళిత బంధు అందజేస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. దీంతో దళితుల బతుకుల్లో వెలుగులు నిండుతాయన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎంగా.. రెండోసారి ఎమ్మెల్యేగా ఆనంద్‌ను కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించుకుని మరింతగా అభివృద్ధి చేసుకుందామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు, దళిత నాయకులు పాల్గొన్నారు..


కొంషట్‌పల్లిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు